## రాజకీయ సన్యాసం ఉత్తమ్‌కు కొత్తేం కాదు

- ప్రతి ఎన్నికల్లో ఇదే శపథం చేస్తూ జనంలో జోకర్ అయ్యిండు
- వేనేపల్లి ఓ వెన్నుపోటుదారుడు
- సరిహద్దు నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర షురూ..
- కేసీఆర్ రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందంటున్న లబ్ధిదారులు
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌కు భారీ మెజార్టీ ఖాయం
- బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

కోదాడ, నవంబర్ 3 : గత అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 50 వేలకు ఒక్క ఓటు తగ్గినా రాజకీయం సన్యాసం చేస్తానని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన వ్యాఖ్యలను ప్రజలు అపహాస్యం చేస్తున్నారని, ఒక జోకర్‌గా చెప్పుకుంటున్నారని బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం కోదాడ బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ అంశాలపై ఆయన ముచ్చటించారు. వేనేపల్లి చందర్‌రావు ఒక కోవర్టు అని, అన్నం పెట్టిన వారికే సున్నం పెట్టే రకమని విమర్శించారు. ఎనిమిది పదులు దాటినా హుందాగా వ్యవహరించాల్సింది పోయి.. తనకు పొసగని పార్టీతో జత కట్టడం చీకటి ఒప్పందంలోనే భాగమేనని చెప్పారు. ఆయన మాటలు నమ్మి పార్టీ మారిన నాయకులు పునరాలోచించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు తెచ్చుకొని కోట్లు సంపాదించిన చందర్‌రావు చరిత్ర హీనుడు అని విమర్శించారు. చందర్‌రావు ప్యాకేజీ నాయకుడని, ఆయన మాయమాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 2009లో ఓ మైనార్టీ నాయకుడుని ఎన్నికల బరిలో నిలిపి ఓడించి, చందర్‌రావుకు సహకరించారని, ఇది చీకటి ఒప్పందంలో భాగం కాదా అని ప్రశ్నించారు. ఉత్తమ్ దంపతులకు కోదాడ, హుజూర్‌నగర్‌లో ఓటమి తప్పదన్నారు. 15 సంవత్సరాలుగా నియోజకవర్గ ప్రజలతో మమేకమై 24 గంటలు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, సరిహద్దు నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర షురూ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, ఈనెల 30న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి అభివృద్ధి ప్రదాత రుణం తీర్చుకుంటామని చెబుతున్నారని తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన శశిధర్‌రెడ్డి.. అధిష్టానం తనకు టిక్కెట్ ఇవ్వన్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ఆయనకు తగిన సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు.

## సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించాలి


అమీనాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

అనంతగిరి, నవంబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గింజుపల్లి రమేశ్ కార్యకర్తలకు సూచించారు. శుక్రచారం మండలంలోని అమీనాబాద్, వాయిలసింగారంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5, 6, 7న మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. కోదాడ గడ్డపై బీఆర్ఎస్ జెండాను మరోసారి ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు రామినేని పూర్ణచందర్‌రావు, వెంకన్న, అనంతగిరి సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, హనుమంతు వెంకటేశ్వర్లు, విశ్వేశ్వర్‌రావు, కొల్లు సుబ్బారావు పాల్గొన్నారు.


శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

### అనురాగ్‌లో ముగిసిన టాస్క్ శిక్షణ తరగతులు

అనంతగిరి, నవంబర్ 3 : మండల కేంద్రంలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో పైథాన్ ప్రోగ్రామింగ్‌పై శుక్రవారం మూడ్రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్స్ ఇన్ పైథాన్ అంశంపై టాస్క్ ప్రతినిధి రాకేశ్‌రెడ్డి పర్యవేక్షణలో శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్‌కు ప్రాధాన్యం ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాదరావు పాల్గొన్నారు.

### తొలిరోజు రెండు నామినేషన్లు

కోదాడ టౌన్, నవంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల సమరం ఊపందుకుంది. కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరిస్తున్నారు. తొలిరోజు శుక్రవారం ప్రజావాణి పార్టీ అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణ తెలిపారు. అదే విధంగా కోదాడకు చెందిన ఎన్ఆర్ఐ జలగం సుధీర్ ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు.

## ప్యాకేజీ నాయకులను నమ్మొద్దు

- కాంగ్రెస్‌కు ఓటేస్తే సమస్యలు కొనితెచ్చుకున్నట్లే...
- బీఆర్ఎస్‌తోనే ప్రగతి పథంలో పల్లెలు
- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం


కాపుగల్లులో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, చిత్రంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

కోదాడ రూరల్, నవంబర్ 3 : ప్యాకేజీల కోసం పూటకో పార్టీ మార్చే ఉసరవెల్లి నాయకులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాపుగల్లు, కూచిపూడి, కూచిపూడితండా, రెడ్లకుంట గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నాడు కాంగ్రెస్ హయాంలో శిథిలావస్థలో ఉన్న గ్రామాలు.. నేడు బీఆర్ఎస్ పాలనలో ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రతి ఇంటికి సమస్యను కొనితెచ్చుకున్నట్లే అవుతుందని, ప్రజలు ఆలోచన చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులకు ఎన్నిక సమయంలో తప్ప ప్రజలు గుర్తుకు రారని, అలాంటి వారిని ప్రజలు తరిమికొట్టాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే 400 గ్యాస్ సిలిండర్, పేద వర్గాలకు 5వేల నగదు ప్రోత్సహకాలు, కుటుంబ బీమా అమలు జరుగుతుందన్నారు. తనను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దొంతగాని అప్పారావు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రచారంలో ఎమ్మెల్సీ తకెళ్లపల్లి రవీందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, ఎంపీపీ చింతా కవితారెడ్డి, పార్టీ మండల సమన్వయకర్త శంకర్‌శెట్టి కోటేశ్వర్‌రావు, మండలాధ్యక్ష, కార్యదర్శులు కాసాని శ్రీనివాస్, శెట్టి సురేశ్‌నాయుడు, సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


కాపుగల్లు ప్రచార ర్యాలీలో పాల్గొన్న మహిళలు

### ఘన స్వాగతం

కాపుగల్లులో నిర్వహించిన ప్రచారంలో వందలాది మంది మహిళలు పాల్గొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల ఆటపాటలతో సందడి నెలకొంది. ఎమ్మెల్యే తొలుత గ్రామ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

కోదాడ, నవంబర్ 3 : మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పరమావత్ నాగరాజు ఆధ్వర్యంలో 150 మంది బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రచార జోరు

ప్రజల నుంచి అనూహ్య స్పందన


కోదాడలో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బొల్లం సతీమణి ఇందిర, బీఆర్ఎస్ శ్రేణులు

కోదాడ, నవంబర్ 3 : కోదాడ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు కోదాడ పట్టణం ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లం సతీమణి ఇందిర, కూతురు కావ్య ప్రచారంలో పాల్గొని ఓట్లు అభ్యర్థించారు. ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తమ మద్దతు బీఆర్ఎస్‌కేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంపటి మధుసూదన్, శ్రావణ్, శ్రీనివాస్‌యాదవ్, ముస్తాఫా, దేవమణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మావతి, కల్లూరు పద్మజ, చలిగంటి వెంకట్, రామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని మాధవరంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ తొగరు సీతారాములు, ఎలక వెంకట్‌రెడ్డి, ఎలక కవిత, ధారా వెంకన్న, నరసింహారావు పాల్గొన్నారు.

నడిగూడెం : మండలంలోని వల్లాపురంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బడేటి చంద్రయ్య, అనంతుల ఆంజనేయులు, దున్నా సుధాకర్, మార్తి ఉపేందర్, నూకపంగు ఈదయ్య, నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని బేతవోలులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి శ్రీను, అక్కినపల్లి జానకీరామాచారి, వీరస్వామి, సైదులు, నాగరాజు పాల్గొన్నారు.


మునగాల : మాధవరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నడిగూడెం : వల్లాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చిలుకూరు :బేతవోలులో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు